
సాక్షి బాపట్ల

శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



కల్యాణ వేంకన్నకు అభిషేకం

దుగ్గిరాల: వనువు యార్డు నమీపంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరాలయంలో శుక్రవారం స్వామికి అభిషేకం చేశారు. స్వామిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు: పొన్నూరు పట్టణ పరిధిలో శుక్రవారం అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వీరాంజనేయ స్వామి సేవలో ఎస్పీ



పొన్నూరు: పట్టణంలోని శ్రీ వీరాంజనేయస్వామిని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులు శుక్రవారం దర్శించుకుని, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వీరా నాయక్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు మాచర్లలో సీఎం పర్యటన



మాచర్లరూరల్: 'స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా మాచర్ల పట్టణానికి సీఎం చంద్రబాబు శనివారం రానున్నారు. ఆయన ఉదయం 10.30 గంటలకు సాగర్ రోడ్డులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 10.45 నుంచి 11.05 గంటల వరకు 23వ వార్డు యాదవ బజారులో నిర్వహించే 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు. 11.10 నుంచి 11.28 గంటల వరకు ఆర్టీసీ గ్యారేజీ వద్ద సఫాయి కార్మికులు, మెడికల్ సిబ్బందితో కలిసి మాటామంతీ కార్యక్రమంలో పాల్గొంటారు. స్వచ్ఛత రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తారు. అనంతరం ప్రజా వేదిక వద్ద స్టాళ్లను సందర్శించి, వేదికపై నుంచి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆటోనగర్ వద్ద పార్టీ కార్యకర్తలతో సమావేశం కానున్నారు. తర్వాత యాదవుల బజారులో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు తదితరులు శుక్రవారం సీఎం పర్యటించే ప్రాంతాలలో ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు తగు సూచనలు చేశారు.

నేడు కోర్టు ప్రాంగణంలో సమావేశం

నరసరావుపేట టౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీస్ ఫర్ చిల్డ్రన్ పథకంపై శనివారం సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రధాన సివిల్ జడ్జి కె.మధుస్వామి శుక్రవారం తెలిపారు. విద్య, ఆరోగ్య, మహిళాశిశు సంక్షేమం,పంచాయతీ రాజ్, కార్మిక సంక్షేమ శాఖల అధికారులతో 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు కోర్టు ప్రాంగణంలో ఈ సమావేశం జరగనుందని పేర్కొన్నారు.

రాహుకేతు పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు



పెదకాకాని: శివాలయంలో రాహుకేతు గ్రహ పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ జీవీడీఎల్ లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 21వ తేదీన మహాలయ అమావాస్య ఆదివారం కావడంతో ఈ పూజలు చేయించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని శుక్రవారం ఆయన పేర్కొన్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని రాహుకేతు పూజా మండపం వద్ద షామియానాలు, క్యూలైన్‌లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున 4 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ జరిగే పూజలకు ప్రధాన కౌంటర్‌లో టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

సుప్రీంకోర్టులోనూ ఉచిత న్యాయ సహాయం

13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎన్. సత్యశ్రీ

నరసరావుపేట టౌన్: మధ్య ఆదాయ వర్గాల వారికి సుప్రీంకోర్టులో ఉచిత న్యాయ సహాయం అందించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎన్. సత్యశ్రీ శుక్రవారం తెలిపారు. సుప్రీంకోర్టులో ఉన్న మిడిల్ ఇన్‌కమ్ గ్రూప్ లీగల్ ఎయిడ్ సొసైటీ ద్వారా సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. సంవత్సరానికి రూ. 12 లక్షలలోపు ఆదాయం ఉన్నవారు దీనికి అర్హులని వివరించారు. ఈ అవకాశాన్ని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



మంగళగిరిటౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో ఈ నెల 22వ తేదీ నుంచి జరగనున్న శ్రీదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల శుభ ఆహ్వానపత్రికను దేవస్థానంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆలయ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అక్షరమే ఆయుధం

ప్రజల గొంతు నొక్కడమే



అనునిత్యం యథార్థాలను ప్రజలకు అందిస్తున్న సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై కేసులు పెట్టడం ప్రజల గొంతు నొక్కడమే. ఇది దురుద్దేశపు కుట్ర. వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టులను బెదిరించడం, వారిపై పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం ప్రజా స్వామ్యంపై ప్రత్యక్ష దాడి అవుతుంది. వాస్తవాలను బయటకు రాకుండా చేయాలనే ఏ ప్రయత్నమూ ఫలించదు. తక్షణమే సాక్షి ఎడిటర్‌పై, రిపోర్టర్లపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి. ప్రజా గొంతుకను నొక్కడం ఎవరి తరమూ కాదు. సత్యానికి ఎప్పుడూ మరణం లేదు.

– చింతలపూడి అశోక్ కుమార్,
వైఎస్సార్‌సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త

కోర్టులు చీవాట్లు పెడుతున్నా మార్పేదీ?



కూటమి ప్రభుత్వం, పోలీసుల వైఖరిపై ఓ వైపు న్యాయస్థానాలు చీవాట్లు పెడుతున్నా తీరు మార్చుకోకుండా తప్పుడు కేసులు బనాయించడం ప్రజాస్వామ్యం కళ్లకు గంతలు కట్టడం కాదా? పోలీసుల ద్వారా కూటమి ప్రభుత్వం ఏకంగా సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు బనాయించడం వెనుక ఆంతర్యం అందరికీ తెలుసు. ప్రశ్నించే గొంతుకను నొక్కాలనుకోవడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజులే. ఎంత అణగదొక్కినా ఎగిసే కెరటంలా నిజాన్ని నిర్భయంగా చాటిచెప్పే సత్తాతో మీడియా ముందుకెళుతుంది. కూటమి ప్రభుత్వం కూడా ఇకనైనా కక్ష సాధింపులు మానుకోవాలి.

– వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు),
వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త

పేదోడి ప్రాణాలు నిలబెట్టేందుకు నాడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పించిన వైద్య కళాశాలల నిర్మాణంపై కూటమి ప్రభుత్వ కుటిల యత్నాలపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు కన్నెర్ర చేశాయి. ప్రైవేటీకరణకు పాలకులు సిద్ధం కావడాన్ని వ్యతిరేకిస్తూ కదం తొక్కాయి. పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరం చేయడానికి చంద్రబాబు సర్కార్ ఆడుతున్న నాటకాలను నడివీధిలో పెట్టాయి. సామాన్యుడికి వైద్య సేవలు ఉచితంగా అందించేందుకు ఉద్దేశించిన బాపట్ల మెడికల్ కాలేజీని అయినవారికి ధారాదత్తం చేయడానికి రాష్ట్రప్రభుత్వం చేస్తున్న కుట్రను అడ్డుకునేందుకు పోరుబాట పట్టాయి. వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు తోడు విద్యార్థులు, యువత, అనుబంధ విభాగాల ప్రతినిధులు, అభిమానులు కూడా మద్దతుగా కదలివచ్చారు. వారిని అడ్డుకోవడానికి పోలీసుల ద్వారా కూటమి పాలకులు అడ్డంకులు సృష్టించినా దాటుకుని మరీ వచ్చి 'చలో మెడికల్ కాలేజీ' కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇకనైనా చంద్రబాబు సర్కార్ బుద్ధి మార్చుకుని మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేసి, అందుబాటులోకి తేవాలని నాయకులు డిమాండ్ చేశారు.



బాపట్ల డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో నిరసన ర్యాలీ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

కూటమి కుట్రలపై ఎగసిన నిరసన

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై వైఎస్సార్‌సీపీ 'చలో మెడికల్ కాలేజీ' విజయవంతం

- కూటమి సర్కార్ కుటిల యత్నాలపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆగ్రహం
- ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిరసన ర్యాలీ
- బాపట్లలో 'చలో మెడికల్ కాలేజీ' కార్యక్రమానికి విశేష స్పందన
- ఎక్కడికక్కడ అడ్డుకోవడానికి పోలీసుల ద్వారా కూటమి పాలకుల యత్నాలు
- అడ్డంకులను ఛేదించుకుని మరీ భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- మద్దతుగా పోటెత్తిన విద్యార్థులు, యువత, అనుబంధ విభాగాల ప్రతినిధులు
- వైద్య విద్య పేదలకు దూరం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం విడనాడాలి
- పేద, మధ్యతరగతి వర్గాలకు ఉచిత వైద్య సేవలను దూరం చేయొద్దు
- వైఎస్ జగన్ సంకల్పించిన వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేయాలని నేతల డిమాండ్
- ప్రభుత్వ వైద్యవిద్యను అంగడి సరుకుగా అమ్మేందుకు కూటమి సర్కార్ కుట్ర
- వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున ధ్వజం



మెడికల్ కాలేజీ వద్ద జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, సమన్వయకర్తలు కరణం వెంకటేష్, గాదె మధుసూదన్‌రెడ్డి, చింతలపూడి అశోక్‌కుమార్, వరికూటి అశోక్‌బాబు, డాక్టర్ ఈవూరి గణేష్

బాపట్ల టౌన్: ప్రభుత్వ వైద్యవిద్యను అంగడి సరుకుగా అమ్మేందుకు కూటమి సర్కార్ ప్రయత్నిస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున తెలిపారు. పార్టీ పిలుపు మేరకు శుక్రవారం బాపట్లలో 'చలో మెడికల్ కాలేజీ' కార్యక్రమాన్ని యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ గడియారస్తంభం, అంబేద్కర్ సర్కిల్, జమ్ముల పాలెం రైల్వే ఓవర్‌బ్రిడ్జి మీదుగా మెడికల్ కళాశాల వరకు సాగింది. జిల్లాలోని వేమూరు, రేపల్లె, బాపట్ల, చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల నుంచి ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తల ఆధ్వర్యంలో యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో చేరుకున్నారు. ర్యాలీలో 'అన్నీ ప్రైవేటీకరణ చేస్తే ప్రభుత్వం ఎందుకు', 'ప్రతి జిల్లాలో ఓ మెడికల్ కళాశాల జగన్ ఆశయం', 'ప్రతి బినామీకి ఓ మెడికల్ కళాశాల చంద్రబాబు ఆశయం', 'పేద విద్యార్థులకు వైద్య విద్య జగన్ సంకల్పం', తన వర్గానికే వైద్యవిద్య బాబు సంకల్పం' అంటూ నినాదాలు చేశారు.

చంద్రబాబు తీరు సిగ్గుచేటు

ర్యాలీ అనంతరం మెడికల్ కళాశాల వద్ద విలేకరులతో మేరుగ నాగార్జున మాట్లాడుతూ... పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికోసం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని సంకల్పించారన్నారు. వాటిని పీపీపీ పేరుతో ప్రైవేటుపరం చేసేందుకు నేడు చంద్రబాబు ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. నీతి, నిజాయతీ లేకుండా అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసి... వాటిల్లో 7 పూర్తి చేసి, 2 మెడికల్ కళాశాలలకు సీట్లు కూడా కేటాయిస్తే వాటిని వెనక్కి పంపించిన ఘనుడు చంద్రబాబు అన్నారు.

ధైర్యం ఉంటే చర్చకు రావాలి

అసలు మెడికల్ కళాశాలలే ఏర్పాటు చేయలేదు... పునాదులే వేయలేదని హోంమంత్రి మాట్లాడటం దారుణమని మేరుగ పేర్కొన్నారు. ధైర్యం ఉంటే మీడియా సాక్షిగా రాష్ట్రంలోని ఏ మెడికల్ కళాశాల వద్దకైనా కూటమి నాయకులు చర్చకు రావాలని, తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పేద, బడుగు, బలహీన వర్గాలపై అక్కసుతోనే పాలన సాగిస్తోందని చెప్పారు. నిధుల కొరతను సాకుగా వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేసే కుట్రకు తెరతీశారన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు వరికూటి అశోక్‌బాబు (వేమూరు), ఈవూరి గణేష్ (రేపల్లె), కరణం వెంకటేష్ (చీరాల), చింతలపూడి అశోక్‌కుమార్ (అద్దంకి), గాదె మధుసూదన్‌రెడ్డి (పర్చూరు), యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేరుగ చందక్‌నాగ్, జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు యల్లావుల సోహిత్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీలో కూటమి సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ప్రైవేటుపరానికి కుట్ర

పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను, సామాన్యులకు మెరుగైన ఉచిత వైద్యాన్ని అందించేందుకు నాటి ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లాకో మెడికల్ కళాశాలలను తీసుకొచ్చింది. పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పేరుతో మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు ఇప్పుడు చంద్రబాబు సర్కార్ కంకణం కట్టుకోవడం సిగ్గుచేటు. తన బినామీలకు అప్పగించేందుకు చంద్రబాబు పీపీపీ పేరిట కుట్రకు తెరతీశారు.

– వరికూటి అశోక్‌బాబు,
వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త

ప్రభుత్వమే కళాశాలలు నిర్మించాలి

పేద విద్యార్థులు కష్టపడి చదువుకొని వైద్యవృత్తిలో రాణించేందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారు. వాటిని లాభాల కోసం ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ ప్రయత్నించడం వారి అసమర్థ పాలనకు నిదర్శనం. పేదలపై ఏ మాత్రం ప్రేమ ఉన్నా ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను పూర్తి చేసి పేద విద్యార్థులకు వైద్యవిద్యను అందించాలి. సామాన్య ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలి.

– కరణం వెంకటేష్,
చీరాల నియోజకవర్గ సమన్వయకర్త

పేదలకు తీవ్ర ఇబ్బందులు

కూటమి సర్కార్ తీసుకుంటున్న పీపీపీ నిర్ణయంతో పేద ప్రజలకు భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలు, వైద్యశాలలు పూర్తిచేస్తే పేద విద్యార్థులకు వైద్యవిద్యను అందించడంతోపాటు నిరుపేదలకు మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందించే అవకాశం ఉంటుంది. పీపీపీ విధానంలో విద్యార్థులు చదువుకోవాలన్నా సీట్లు కొనుగోలు చేయాల్సిందే. సామాన్య ప్రజలు వైద్యసేవలు పొందాలంటే రూ. లక్షలు ఖర్చు పెట్టాల్సిందే.

– డాక్టర్ ఈవూరి గణేష్,
రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త

కూటమి కుట్రలో భాగమే 'పీపీపీ'

కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రపూరిత రాజకీయాలకు నిదర్శనమే పీపీపీ విధానం. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎంగా కేంద్రం ప్రభుత్వం నుంచి 17 మెడికల్ కళాశాలలను అనుమతులు తీసుకొచ్చారు. వాటికి స్థలాన్ని కేటాయించి వైద్యశాలల అభివృద్ధికి రూ.వేల కోట్లు ఖర్చు చేశారు. వాటిని ప్రైవేటుపరం చేసే హక్కు కూటమి ప్రభుత్వానికి లేదు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసిన ఘనత నాడు వైఎస్సార్, నేడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుంది.

– చింతలపూడి అశోక్‌కుమార్,
అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త

ఆ విధానం అంటేనే దోపిడీ

కూటమి ప్రభుత్వం దోపిడీ, అవినీతి కోసం పీపీపీ విధానాన్ని తీసుకొస్తోంది. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆలోచించని విధంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకోసం మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారు. వాటిని పీపీపీ పేరుతో చంద్రబాబు సర్కారు అమ్మకానికి పెట్టడం సరికాదు. పేదల పక్షాన ఎలాంటి పోరాటాలు చేయటానికైనా వెనుకాడేది లేదు. ప్రభుత్వమే కళాశాలలు పూర్తి చేసే వరకు పోరాటం చేస్తాం. ఇంత దుర్మార్గంగా, నీచంగా ఏ ప్రభుత్వమూ ఆలోచించలేదు.

– గాదె మధుసూదన్‌రెడ్డి,
పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త

ఉచిత ప్రసాద వితరణకు విరాళం




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఉచిత ప్రసాద వితరణ పథకానికి శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన గొట్టుముక్కల నాగమణి కుటుంబం రూ. 1,00116 విరాళం అందించింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.



సంఘటనా స్థలం

ప్రమాదంలో గ్రానైట్ కార్మికుడు మృతి




బల్లికురవ: రాయి ఎత్తుతున్న సమయంలో గొలుసు తెగి రాయి, యంత్రం మీద పడటంతో కార్మికుడు మృతి చెందిన ఘటన శుక్రవారం ఉప్పమాగులూరు సమీపంలోని హర్షిత గ్రానైట్ పరిశ్రమలో జరిగింది. ఎస్సై వై. నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాకేష్ కుమార్(29) పరిశ్రమలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. కటింగ్ రాయిని మిషన్‌పైకి ఎత్తుతుండగా రాయికి కట్టిన గొలుసు తెగింది. రాయితోపాటు తుప్పు పట్టిన యంత్రం కూడా అతడిపై పడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చిలకలూరిపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కృష్ణా నదిలో పెరుగుతున్న వరద



పెసర్లంక - గాజుల్లంక నడుమ కృష్ణా నదిలో నిండుగా ప్రవహిస్తున్న వరద నీరు



పెసర్లంక - పెదలంక అరవింద వారధి వద్ద కృష్ణా నదిలో వరద ప్రవాహం

కొల్లూరు: కృష్ణా నదిని వరద ముప్పు వీడటం లేదు. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల ప్రభావంతో నదిలో ఇంచుమించు 50 రోజులపై బడి వరద ప్రవాహం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. ప్రకాశం బ్యారేజ్ నుంచి వరద నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో శుక్రవారం తిరిగి నదిలో వరద తీవ్రత పెరిగింది. ఈ కారణంగా భూగర్భ జలాలు పెరిగినప్పటికీ, నదీ తీర గ్రామాల వాసులను వరద ముప్పు భయం వెన్నాడుతోంది.

అన్నదాతలకు పంట ముంపు భయం

వరద గణనీయంగా పెరిగితే పంట పొలాలు మునిగి పోతాయన్న ఆందోళన రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రూ.వేల కోట్లు పెట్టుబడుల రూపంలో వెచ్చించి సాగు చేస్తున్న వాణిజ్య పంటలు గతేడాది కృష్ణమ్మ ప్రకోపానికి ఎందుకూ పనికిరాకుండా పోయిన విషయాన్ని రైతులు గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణా నదికి ఈ ఏడాది విరామం లేకుండా వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ఏ సమయంలో వరద తీవ్రత అధికమై గ్రామాల మీదకు విరుచుకు పడుతుందోనన్న భయం వెన్నాడుతోంది. గత నాలుగు రోజుల నుంచి తగ్గుతూ, పెరుగుతూ వరద ప్రవాహం దోబుచులాడింది. ప్రకాశం బ్యారేజ్ నుంచి నదిలోకి 2.29 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేయడంతో నది నిండుగా ప్రవహిస్తోంది.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,000** గరిష్ఠం : రూ. **3,000**

మోడల్ ధర రూ. **2,500**

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	29,674
అమ్మకాలు	33,234
నిల్వ	4,705

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,500
నంబరు-5	10,000-13,500
273	10,000-13,300
341	10,000-15,300
సూపర్ -10	11,500-14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,600
341	10,000-15,600

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,700
బాడిగ-355	10,000 - 15,400
దేవనూరు డీలక్స్	10,000 - 14,000
ఆర్మూర్	9,800 - 12,300
తాలుకాయలు	6,200 - 7,300

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-14,800
బాడిగ - 355	10,000-15,500
దేవనూరు డీలక్స్	10,000-14,000
తాలు	5,200 - 7,300

-కొరిటిపాడు (గుంటూరు)

క్లుప్తంగా

ఈశ్వర్ సాయి థియేటర్‌లో చోరీ

రూ.8 లక్షల విలువైన సామగ్రి అపహరణ



ఫిరంగిపురం: స్థానిక ఈశ్వర సాయి సినిమా థియేటర్‌లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సేకరించిన సమాచారం ప్రకారం.. గత పది రోజులుగా థియేటర్‌లో సినిమాలు ప్రదర్శించడం లేదు. సమీపంలో గడ్డి కోసుకునేందుకు వచ్చిన యువకుడు గేటు తాళాలు పగలగొట్టి ఉండటం గమనించి యాజమాన్యానికి సమాచారం ఇచ్చాడు. కాగా థియేటర్ యజమాని తిరుపతి వెళ్లడంతో అతడి సోదరుడు చిట్టా విజయభాస్కరరెడ్డి వచ్చి పరిశీలించారు. విలువైన వస్తువులు దొంగలించడంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. థియేటర్‌లో సీపీయూలు, బ్యాటరీలు, డైనమాలు, స్టెపిలైజర్లు, పాత జనరేటర్, విద్యుత్ మోటార్, వైరింగ్ సబ్ ఊఫర్స్ తదితర వస్తువులు మాయమైనట్లు తెలిపారు. వీటి విలువ రూ. 8లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. థియేటర్ ముందు భాగంలో ఆటో గుర్తులను గుర్తించారు. ఆరు నెలల కిందట కూడా దొంగతనం జరగడంతో పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు యజమాని చిట్టా బాపూజీరెడ్డి తెలిపారు. రెండు నెలల కిందట కూడా యువకులు దొంగతనం చేసేందుకు రాగా థియేటర్ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారని, వారిపై చర్యలు కూడా తీసుకోలేదని ఆయన ఆరోపించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు

వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున



పార్టీ నాయకులతో బాపట్లకు తరలివెళుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్

బాపట్ల టౌన్/చీరాల అర్బన్: పేదల వైద్యసేవలు అందించే మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయటం సరికాదని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున తెలిపారు. వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు శుక్రవారం బాపట్ల జిల్లాలోని బాపట్ల, వేమూరు, రేపల్లె, చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల సమన్వయకర్తలు, యువజన విభాగం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో చలో మెడికల్ కాలేజీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బాపట్లలోని మెడికల్ కళాశాల వరకు నిర్వహించారు. పేదలకు వైద్యసేవలు అందించే మెడికల్ కళాశాలలను చంద్రబాబు తన బినామీలకు కట్టబెట్టే ప్రయత్నం సరికాదని మేరుగ పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే ఏ స్థాయిలో ఉద్యమించడానికైనా వెనుకాడేది లేదన్నారు.

ప్రైవేటుపరం చేస్తే సహించం

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ చీరాల నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్‌బాబు అన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయంపై వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పిలుపు మేరకు చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి శుక్రవారం బాపట్లలోని మెడికల్ కాలేజీ భవనం వద్దకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కరణం వెంకటేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటు పరం చేయాలనే నిర్ణయం దారుణమన్నారు. అలా చేస్తే సామాన్యులకు వైద్యం, పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుందన్నారు. ప్రభుత్వమే మెడికల్ కాలేజీలను నిర్వహిస్తే ఫీజులు కూడా తగ్గుతాయన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే మెడికల్ కాలేజీల్లో రూ.వేలల్లో ఉన్న ఫీజులు.. ప్రైవేటుపరం అయితే రూ.లక్షల్లోకి వెళతాయన్నారు. టీడీపీ హయాంలో ఒక్క మెడికల్ కాలేజీని కూడా నిర్మించలేదన్నారు. 2019-24 మధ్య అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చారన్నారు. కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. నిధుల లేమి సాకుతో ప్రభుత్వం వాటిని ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని కాలేజీలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బాపట్లకు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ళ వాసు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కోడూరి ప్రసాద్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గోసాల అశోక్, పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు, వేటపాలెం మండల అధ్యక్షులు సాధు రాఘవ, మాజీ అధ్యక్షులు బి.సుబ్బారావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు చీమకుర్తి బాలకృష్ణ, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాబూరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాస్టర్, మహిళా నాయకురాలు ప్రసన్న, జిల్లా మున్సిపల్ వింగ్ సభ్యులు కంచర్ల చక్రవర్తి, కౌన్సిలర్లు కీర్తి వెంకటరావు, కంపా అరుణ్, మాజీ కౌన్సిలర్ చెల్లి బాబూరావు, పార్టీ నాయకులు ఎస్.నవీన్, పోతురాజు, జంగా ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపుపై నిలదీసినందుకు దాడి



కొల్లూరు మండలం చింతర్లంక కృష్ణా నదిలో ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తవ్వకాలు



దాడి గురించి సమాచారం తెలుసుకుంటున్న పోలీసులు

కొల్లూరు: పట్టపగలు యథేచ్ఛగా వందల ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేపట్టడాన్ని ప్రశ్నించిన వ్యక్తిపై శుక్రవారం మండలంలోని చింతర్లంకలో అక్రమార్కులు దాడికి తెగబడ్డారు. గ్రామంలోని సీసీ రోడ్ల వెంబడి ఉన్న నీటి పైపులు, పశువులు, జీవాల కోసం ఉంచిన గ్రాసాలను తొక్కించుకుంటూ వెళ్లడం, ప్రజలకు హానికరంగా ట్రాక్టర్లు ప్రయాణించడంపై చింతర్లంకకు చెందిన ప్రజా సంఘాల నాయకుడు తోడేటి సురేష్ ప్రశ్నించారు. భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉండటంతోపాటు నదీ తీరం వెంబడి కోతలు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు. ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని పట్టుపట్టడంతో వివాదం చోటుచేసుకుంది. సురేష్‌పై ఇసుక తవ్వకాలకు ప్రోత్సహిస్తున్న వ్యక్తులు తిరగబడటంతో తోపులాట చోటుచేసుకొంది. బాధితుడు ఓ ట్రాక్టర్‌పై పడటంతో గాయపడ్డారు. బంధువులు ఆయన్ను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కొల్లూరుకు చెందిన ఓ టీడీపీ నాయకుడు ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ. 100 - రూ. 200 వరకు వసూలు చేపట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా సంఘాల నాయకుడిపై దాడి సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు నదిలో ఉన్న ట్రాక్టర్లను అడ్డగించకపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. పోలీసులు నది వద్దకు వెళ్లే సమయానికి 50కి పైగా ట్రాక్టర్లు ఇసుక నింపుకొని సిద్ధంగా ఉన్నా వాటిని నిలువరించకుండా వెనుతిరగడంపై పోలీసుల తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. దీనిపై కొల్లూరు తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... పెసర్లంక అరవిందవారధి, చింతర్లంక గ్రామాలలో పోలీసు, రెవెన్యూ సిబ్బందితో 24 గంటల నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. రెవెన్యూ సిబ్బందిపై బెదిరింపులకు పాల్పడుతున్న విషయం తన దృష్టికి సిబ్బంది తీసుకొచ్చారని పేర్కొన్నారు.

సమస్యలపై చర్చించే తీరిక ప్రభుత్వానికి లేదా?

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



రణభేరిలో నినాదాలు చేస్తున్న నక్కా వెంకటేశ్వర్లు, కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించే తీరిక కూటమి ప్రభుత్వానికి లేకుండా పోయిందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు విమర్శించారు. శుక్రవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద విద్యారంగ, ఉపాధ్యాయ అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ తలపెట్టిన రణభేరి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయుల బైక్ ర్యాలీకి జెండా ఊపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2023 జూలై నుంచి వర్తింప చేయాల్సిన 12వ పీఆర్సీపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకూ ఎటూ తేల్చలేదని, నాలుగు విడతలుగా డీఏ బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. సంబంధిత ఆర్థిక అంశాలపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఒక్కరోజు సైతం చర్చించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై నిందలు మోపుతూ వారిని ఒత్తిడి గురి చేసే విధానాలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించకపోవడంతో పాటు నాలుగు విడతల డీఏ బకాయిలపై వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏ.ఎన్. కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌కు తావులేని పాఠశాల కావాలని, ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకుని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్ మాట్లాడుతూ ఈనెల 25న జరిగే రణభేరి రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

నేడు జిల్లాస్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు

నగరం: ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 20వ తేదీన బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అల్లపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కే వెంకటేశ్వరావు శుక్రవారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అండర్ 14,17 విభాగాలలో ఎంపికలు ఉంటాయన్నారు. అండర్ 14 విభాగానికి 01-01-2012 తర్వాత, అండర్ 19 విభాగంలో 01-01-2009 తర్వాత జన్మించిన వారు అర్హులని చెప్పారు. ఆధార్ కార్డ్, జనన ధ్రువీకరణ పత్రం, ఎంట్రీ ఫామ్‌పై స్కూల్ హెచ్‌ఎంతో సంతకం చేయించుకుని రావాలని సూచించారు.

చిరు వ్యాపారులకు రుణాల మంజూరుపై అవగాహన

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వానిధి 2.0 లోక కల్యాణం పథకం ద్వారా వీధి విక్రయదారులు, చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి రూ.10 నుంచి 50వేల వరకు రుణాలు లభిస్తాయని మెప్మా పీడీ వి. విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గతంలో రూ.10వేలు తీసుకున్న వారికి రూ.20వేలు, రూ. 20 వేలు తీసుకున్న వారికి రూ.50వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు నేటి శనివారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని వారికి నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో, మంగళగిరి,తాడేపల్లి పరిధిలోని వారికి మంగళగిరి మున్సిపల్ కౌన్సిల్ హాలులో 22న, తెనాలి పరిధిలోని వారికి తెనాలి మున్సిపల్ కౌన్సిల్ హాలులో 23న, పొన్నూరు పరిధిలోని వారికి పొన్నూరు మున్సిపల్ కౌన్సిల్‌లో 24న అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వీధి విక్రయదారులు, చిన్న వ్యాపారాలు హాజరుకావాలని ఆమె సూచించారు.

టెయిల్ పాండ్ ప్రాజెక్టును సందర్శించిన కేఆర్ఎంబీ చైర్మన్

సత్రశాల(రెంటచింతల): నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టును, పవర్ హౌస్‌ను కృష్ణా నదీ జలాల బోర్డు చైర్మన్ బీపీ పాండే శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కమల్, ఏపీ జెన్‌కో ఏసీ వెంకట రమణ, శ్రీనివాసులు, ఈఈ సుబ్రమణ్యం, ఏఈలు జయశంకర్, గిరిబాబు, మహమూద్, మల్లేష్ తదితరులున్నారు.

రాష్ట్ర అథ్లెటిక్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈనెల 26 నుంచి 29 వరకు జరగనున్న ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఇందులో పాల్గొనే గుంటూరు జిల్లా అండర్- 14 ,16 బాలబాలికల జట్టు వివరాలను అథ్లెటిక్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్ ప్రసాద్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 26వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో వయస్సు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డు తీసుకొని గుంటూరు జట్టు కోచ్ కె.రవిని సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎంపికైన క్రీడాకారుల వివరాలు

అండర్ 14 బాలుర విభాగం: డి. వెంకట సాయి, బి. గణ రమేష్, కె. నాగసాయి

అండర్-14 బాలికలు: పి. హర్షిణి, పి. హాసిని, వై. అన్ని అక్షర

అండర్ 16 బాలికలు: పి. చేతనశ్రీ, జి. పావని, మహమ్మద్ అలీఫా షేక్, షేక్ హీనా సుభానం, పి. అంకిత, సీహెచ్. కరుణ, ఎండి. కరిష్మా, టి. వెంకట స్వాతి.

అండర్ 16 బాలురు: బి.ఎల్.ఎస్. శ్రీహర్ష, జి. రుషి కిరణ్, జి. సూర్యతేజ, ఎస్‌కే ఎండీ అష్రఫ్, ఎం. రాజ్ కుమార్, ఎం. సుహాస్, ఏ. వెంకటరెడ్డి ఏ. కృష్ణవంశీ, కె.నవ్య ప్రదీప్, కె.మణిదీప్, జె. హరి వెంకట్ అఖిల్

చిన్నారులతో అసభ్యకరంగా ప్రవర్తించిన వృద్ధుడు

- ప్రభుత్వ పాఠశాలలో దురాగతం
- పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు

ప్రత్తిపాడు: మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో దురాగతం చోటుచేసుకుంది. అభం శుభం తెలియని చిన్నారులపై వృద్ధుడు అవమానకర రీతిలో అసభ్యకరంగా వ్యవహరించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని రావిపాటివారిపాలెం ప్రాథమిక పాఠశాలలో స్కావెంజర్‌గా చేస్తున్న వాసిమళ్ల నాగమ్మకు కొద్దిరోజులుగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆమె భర్త సామియేలు (75) పాఠశాలకు వస్తున్నాడు. ప్రధానోపాధ్యాయుడు కూడా బుధవారం వరకూ అనారోగ్య సమస్యలతో సెలవులో ఉన్నారు. బడిలో విధుల్లో ఉన్న ఒక్క టీచర్ విద్యార్థులందరినీ ఒకే తరగతి గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. మూడు రోజుల కిందట పక్క తరగతి గదిలోని వరండాలో ఉన్న వాటర్ కూలర్ దగ్గర మంచి నీళ్లు తాగేందుకు వచ్చిన ఒకటవ తరగతి చిన్నారి పైనా, మూడవ తరగతి చిన్నారి పైనా అక్కడే ఉన్న సామియేలు అసభ్యంగా ప్రవర్తించాడు. అభం శుభం తెలియని చిన్నారులను ప్రైవేటు ప్లేసుల్లో తాకుతూ పైశాచికంగా ప్రవర్తించాడు. విద్యార్థులు ఏడుస్తూ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు గురువారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులను నిలదీశారు. ఇలాంటి పనులు చేస్తుంటే ఏం చేస్తున్నారని మండిపడ్డారు. పసి పిల్లలపై ఇటువంటి అసభ్య పనులేంటంటూ సామియేలు పైనా ఉపాధ్యాయులపై తల్లిదండ్రులు నిప్పులు చెరిగారు. దీంతో సామియేలు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో 18వ తేదీ రాత్రి ఎస్ఐ నరహరి సామియేలుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. శుక్రవారం విషయం జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు తెలియడంతో వారి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు ఎంఈవో సీహెచ్ రమాదేవి పాఠశాలలో ప్రాథమిక విచారణ నిర్వహించారు. హెచ్‌ఎం రవితో పాటు ఉపాధ్యాయురాలు, విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు.

విద్యారంగ సమస్యలను అసెంబ్లీలో చర్చించాలి

- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.6,400 కోట్లు విడుదల చేయాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర బాలికల కన్వీనర్ బాలనవ్యశ్రీ



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: అసెంబ్లీ సమావేశాలలో కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై సమగ్రంగా చర్చించి పరిష్కార దిశగా నిర్ణయాలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ లింగిశెట్టి బాలనవ్యశ్రీ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు నవ్యశ్రీ మాట్లాడుతూ ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన యువగళం పాదయాత్రలో 77, 107, 108 జీఓలను రద్దు చేస్తామని ప్రకటించారని, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచినా జీఓల రద్దు మాట అటుంచి వైద్యవిద్యను ప్రైవేటు పరం చేసేందుకు నిర్ణయించటం దారుణమన్నారు. ప్రైవేటు పరం చేయటాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేసారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దాసరి హేమంత్‌కుమార్, ఎం.మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైల్వే ప్రాంగణాల పరిశుభ్రత సమష్టి బాధ్యత

డీఆర్ఎం సుథేష్ణ సేన్



గుంటూరు రైల్వే స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న డీఆర్ఎం, సిబ్బంది

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : స్వచ్ఛ భారత్ దార్శనికతకు అనుగుణంగా రైల్వే ప్రాంగణాలను, పరిసరాలను శుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడంలో సమష్టి బాధ్యత వహించాలని గుంటూరు రైల్వే డివిజనల్ డీఆర్ఎం సుథేష్ణ సేన్ పిలుపు నిచ్చారు. పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలం నుంచి గుంటూరు రైల్వే స్టేషన్ వరకు స్వచ్ఛతా హి సేవ -2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. డివిజన్ అధికారులు, సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్, వలంటీర్లతో కలిసి డీఆర్ఎం ప్రారంభించారు. ర్యాలీలో సిబ్బంది, అధికారులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతి రైల్వే స్టేషన్, కార్యాలయాల ప్రాంగణంలో ఆకుపచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో విధులు నిర్వహించడం వల్ల మానసిక సంతృప్తి దక్కుతుందని తెలిపారు. పచ్చని చెట్లు చుట్టు ఉన్న ప్రాంగణాల్లోకి కలుషితమైన గాలి రాదని తెలిపారు. అనంతరం ర్యాలీని విజయవంతంగా రైల్వే స్టేషన్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్ఎం కార్యాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య



మల్లేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

చందోలు(కర్లపాలెం): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన ఖాజీపాలెం పంచాయతీ పరిధిలోని అయోధ్యనగర్‌లో చోటుచేసుకుంది. చందోలు ఎస్ఐ ఎంవీ శివకుమార్ యాదవ్ తెలిపిన వివరాల మేరకు... అయోధ్యనగర్‌కు చెందిన కంతేటి మల్లేశ్వరరావు(29) కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం రాత్రి తమ ఇంటి సమీపంలోని తుమ్మ చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడని తెలిపారు. మల్లేశ్వరరావుకు భార్య సముద్రాలు ఉందన్నారు. మృతుని సోదరుడు రమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించామని పేర్కొన్నారు.

కారు ఢీకొని ద్విచక్రవాహన చోదకుడు మృతి



అంజిరెడ్డి మృతదేహం

కర్లపాలెం: బైకును కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన బాపట్ల జిల్లా చీరాల మండలం తోటవారిపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కర్లపాలెం మండలం కొత్త నందాయపాలెం గ్రామానికి చెందిన ఆట్ల అంజిరెడ్డి(54) చీరాల వెళ్లి బైకుపై తిరిగి వస్తున్నాడు. ఇంతలో బాపట్ల నుంచి చీరాల వైపు వెళుతున్న కారు తోటవారిపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై అతడి బైకును ఎదురుగా ఢీకొంది. అంజిరెడ్డికి తీవ్రగాయాలు కావటంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కారు రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో అందులో ఉన్న ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈపురుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాపట్ల ఆర్మీ ఉద్యోగి రాజస్థాన్‌లో మృతి



వెంకట దుర్గారెడ్డి (ఫైల్)

బాపట్ల టౌన్: బాపట్ల ప్రాంతానికి చెందిన ఆర్మీ ఉద్యోగి రాజస్థాన్‌లో మృతి చెందారు. బాపట్ల మండలం, వెదుళ్ళపల్లి కొత్తపాలెం గ్రామానికి చెందిన మేడిబోయిన వెంకట దుర్గారెడ్డి 2023లో అగ్నివీర్‌గా ఆర్మీ ఉద్యోగంలో చేరారు. రాజస్థాన్‌లో విధులు నిర్వర్తిస్తున్న దుర్గారెడ్డి గురువారం రాత్రి మృతి చెందారు. విశ్వసనీయ సమాచారం మేరకు దుర్గారెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. మృతదేహం శనివారం స్వగ్రామానికి వస్తుందని ఆర్మీ అధికారులు, పోలీసులు తెలిపారు.

మర్రి రాజశేఖర్‌ను టీడీపీలోకి తీసుకోవద్దు

నరసరావుపేట: ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ టీడీపీలోకి రావడం పట్ల ఆ పార్టీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. నాదెండ్ల మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ అధ్యక్షతన సాతులూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌పై పలు వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. పార్టీ కోసం కష్టపడిన తమను వదిలి, పదవుల కోసం మారే నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీని నమ్ముకుని తనతోపాటు చాలామంది నాయకులు, కార్యకర్తలు పార్టీ మారనందుకు ఆర్థికంగా, రాజకీయంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లగా తెలుగుదేశం పార్టీకి కట్టుబడి ఉన్న నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌ను తిరిగి పార్టీలోకి చేర్చుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. గతంలో రాజశేఖర్ తనను బెదిరింపులకు గురి చేశారని, తన వ్యాపారాలపై దాడులు చేయించాడంటూ ఆరోపించారు. అంతేకాకుండా తనపై నాటి మంత్రులు జూపల్లి కృష్ణారావు, కన్నా లక్ష్మీనారాయణల మద్దతుతో తప్పుడు కేసులు పెట్టించి, చివరకు కటకటాల పాలు చేశారన్నారు. పార్టీనేతల్ని ఇబ్బందులకు గురి చేసిన వ్యక్తికి పార్టీలోకి ఆహ్వానించడం పట్ల తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇప్పటికైనా పార్టీ అధినాయకులు కార్యకర్తల మనోభావాలను పార్టీ గౌరవించి తమ నిర్ణయాన్ని పునః పరిశీలించాలని వారు డిమాండ్ చేశారు. తమ అభిప్రాయాన్ని మార్చుకోని పక్షంలో మండలస్థాయిలో ఉన్న అన్ని పదవులకూ రాజీనామా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకుని తక్షణమే స్పందించాలని కోరారు.

లబ్ధిదారులకు దీపం నగదు బదిలీ చేయాలి

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

గుంటూరు వెస్ట్: దీపం పథకం - 2 ద్వారా జిల్లాలో 1,257 మందికి సబ్సిడీ నగదు ఖాతాల్లో నమోదు కావడం లేదని వచ్చిన ఫిర్యాదులపై శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ హాలులో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ గ్యాస్ ఏజెన్సీలు, డిస్ట్రిబ్యూటర్లు, సివిల్ సప్లయ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, తెనాలి, మేడికొండూరు మండలాల్లో ఎక్కువగా నగదు జమకాలేదని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. 1257 మంది జాబితాను గ్యాస్ ఏజెన్సీలు, డిస్ట్రిబ్యూటర్లకు పంపాలని జిల్లా సప్లయ్ అధికారికి సూచించారు. వినియోగదారులకు ఫోన్ చేసి ఎందుకు సబ్సిడీ నగదు పడలేదో వివరించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను వచ్చే బుధవారం నాటికి పూర్తి చేయాలని చెప్పారు. ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులు లేటెస్ట్ ఆధార్ కార్డు , పాసు పుస్తకం బ్యాంక్‌కు తీసుకువెళ్లి అక్కౌంట్ డీ లింక్ చేయించుకుని, మళ్లీ లింక్ చేయించాలని సూచించారు. కొంత మందికి ఆధార్ ఇన్ ఆక్టివ్ అని వస్తున్నదని, వారికి పొరపాటున రెండు ఆధార్‌లు ఉంటే ఒక కార్డును ఇవ్వాలని తెలిపారు. కొందరికి ఆధార్ బ్యాంక్ ఖాతాకు లింక్ కానందున, ఈకేవైసీ చేయించుకోకపోవడం వల్ల సబ్సిడీ జమ కావడం లేదని వివరించారు. ఆధార్ అప్ డేట్ వివరాలు లేనివారు 1,031 మంది ఉన్నారని , వారు వివరాలు అందజేయాలని సూచించారు. సమావేశంలో డీఎస్ఓ కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

23న సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శన

సత్తెనపల్లి: పట్టణంలోని లూథరన్ చర్చి ప్రాంగణంలో ఈ నెల 23న సాయంత్రం 6.00 గంటలకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘం శరణం గచ్ఛామి 769వ నాటక ప్రదర్శన జరుగుతుందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి రవిబాబు శుక్రవారం తెలిపారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారి (నవభారత నిర్మాత, ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం, ఆశయం, లక్ష్యాలపై కళారూపం) ఉంటుందన్నారు.